క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో. చైత్ర మాస శనివారం, స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం పర్వదినం పురస్కరించుకుని శ్రీ వారికి విశేష అభిషేకం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వకేన్సుల వారికి, గరుత్మంతుల వారికి అర్చనది కై కర్యం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు లింగాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం మండలంలోని లింగాపురంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓవో మాధురి తెలిపారు. శనివారం ఆమె కార్యక్రమ వివరాలను తెలియచేస్తూ ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు నంబూరు శంకరరావుతో పాటుగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, గ్రామస్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సత్తెనపల్లి: వేసవి కాలంలో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 14 నుంచి 20వ వరకు అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని తాలూకా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, రైల్వేస్టేషన్ వద్ద శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు 101 కు కానీ ఫైర్ స్టేషన్‌కు కానీ ఫోన్ చేసి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వేలం

అచ్చంపేట: వివిధ కేసుల్లో పట్టుబడిన 6 మోటారు వాహనాలను, ఒక కారును స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టరు వీరాస్వామి ఆధ్వర్యంలో ఎస్.ఐ కె.పాల్‌రవీంద్ర శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. అన్ని వాహనాలు కలిపి కనిష్ట ధర రూ.76 వేలు కాగా, గరిష్టంగా రూ.1.05,462లకు పాటదారులు వాహనాలను కై వసం చేసుకున్నారు. ఒక స్కూటరును ఎవరూ పాడుకునేందుకు ముందుకు రాలేదు. ఈ సందర్భంగా సీఐ వీరాస్వామి మాట్లాడుతూ వాహనాలను చేజిక్కించుకున్న వారంతా తమ సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవలసి ఉంటుందని, 6 శాతం జీఎస్‌టి చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. పాటలో పలు గ్రామాల నుంచి వచ్చిన సుమారు 30 మందికి పైగా పాల్గొన్నారు.

మట్టినమూనాల సేకరణపై అవగాహన

క్రోసూరు: క్రోసూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడిఏ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో రైతుభరోసా సిబ్బందికి మట్టిన మూనాల సేకరణ పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ మట్టినమూనాలు వివిధ భౌతిక, రసాయన పరీక్షల ద్వారా మట్టిలో పోషకాల పరిమాణాన్ని లెక్కగట్టి , అధిక దిగుబడులు సాధించేందుకు కావాల్సిన ఎరువులను వివిధ పంటలను బట్టి సిఫార్సు చేయడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది ఈనెల 17 నుంచి మట్టినమూనాలు సేకరిస్తారని అన్నారు. మట్టినమూనాలుసేకరించేందుకు వేసవి కాలం అనువైన కాలమని అన్నారు. ఈ సందర్భంగా ఏఓ మట్టినమూనాలు సేకరించు విధానాన్ని చేసి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చల్లగుండ్ల సర్పంచ్‌గా అరవా ఆదిలక్ష్మి

నకరికల్లు : వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పదవుల్లో మహిళలకు సమ ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామ సర్పంచ్‌గా అరవా ఆదిలక్ష్మి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా ఉన్న బత్తుల బేబి అనారోగ్యంపై సెలవు పెట్టడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న అరవా ఆదిలక్ష్మి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో గ్రామసర్పంచ్ పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మేడికొండ మస్తాన్‌రెడ్డి, మేడికొండ రామిరెడ్డి, వంగా రాజారెడ్డి, బత్తుల రామాంజినేయులు, బైరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్ ..మా నమ్మకం

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెనపల్లిటౌన్, సత్తెనపల్లిరూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని గ్రామాలలో 'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి .. ప్రస్తుత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేశారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను చదివి వినిపించి సమాధానాలు రాబట్టారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. లబ్ధిదారుల ఇష్టం మేరకు ఇంటి తలుపులకు, గోడలకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అంటించి పంపిణీ చేశారు. వారి సెల్‌ఫోన్ నుంచి :82960 82960 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చారు. పట్టణంలోని 19వ వార్డులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు, యాసారపు బాబు ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సింగపాడులో జగనన్న నువ్వే మా నమ్మకం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు, జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం శనివారం పలుగ్రామాల్లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తోపాటు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి జగనన్న పరిపాలనపై అభిప్రాయాలను సేకరించారు. గోడలకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్‌లు అంటించారు : 8296082960 నంబర్‌కు మిస్‌డ్‌కాల్ ఇప్పించారు. ఈ సందర్భంగా నర్సింగపాడు గ్రామం జగనన్న నినాదాలతో మార్మోగింది. నాయకులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా హాజరై పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలు నేరుగా తమకే చేరుతున్నాయని పదికాలాల పాటు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల స్పందన చూస్తుంటే 175కి 175సీట్లు ఖాయంగా వస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల నాయకులు, సచివాలయం కన్వీనర్‌లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



నర్సింగపాడులో జగనన్న నువ్వే మా నమ్మకం అంటూ నినాదాలు చేస్తున్న ప్రజలు

75త్యాళ్ళూరులో మా నమ్మకం నువ్వే జగనన్న

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జోరుగా సాగుతుంది. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్ కుమార్, సొసైటీ చైర్మన్ కల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ అల్లం భవాని, మాజీ ఎంపీటిసి గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ పరిశుద్ధకుమారి, సొసైటీ డైరెక్టర్ బత్తుల రాజేంద్ర, కీసర గంగాధర్‌రెడ్డి, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు.



మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న కౌన్సిలర్ అవ్వారు శ్రీను



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న నేతలు

ప్రపంచ మేధావి అంబేడ్కర్

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ స్థాయి మేధావి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 31వ వార్డు అబ్బూర్ రోడ్ లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక సమానత్వం, సమాన అవకాశాలు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. షెడ్యూల్డ్ కులాలు, తెగల, ఆర్థిక సామాజిక అభివృద్ధికి కృషి చేశారన్నారు. అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని, అంబేడ్కర్ లక్ష్యాలను సాధనే లక్ష్యంగా మనమందరం సమష్టిగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన ఆశయ సాధనలో భాగంగా అన్ని వర్గాలకు అవకాశాలు కల్పిస్తుందన్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయమని, భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్నారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ అంబేడ్కర్ అస్పృశ్యత, అంటరాని తనాన్ని రూపుమాపి రాజ్యాంగానికి రూపకల్పన చేసిన ప్రపంచ మేధావి అని కొనియాడారు. గుంటూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువ లేమన్నారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదాజాన్ పాల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యాసారపు బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడిరెక్క దేవదాసు, నాయకులు అచ్యుత శివప్రసాద్, వెలుగూరి శరత్, వరికల్లు కోటేశ్వరరావు, సదనం హరి, కాశిమాల ఓబ్బయ్య, జూపల్లి పాల్, గుంటూరు ఆశీర్వాదం, సందెపగు గాంధీ, ఈసా, కాటుమాల డేవిడ్, ఉల్లంఘుల ప్రసాద్, తలతోటి పాల్ కుమార్, తదితరులు ఉన్నారు.



అబ్బూరురోడ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

స్వార్థ నాయకుల ప్రోద్బలంతో ఎమ్మెల్యేపై విమర్శలు

- ఎమ్మెల్యే నంబూరును విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు
- బహిష్కరణ నేత వరప్రసాద్‌పై వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజం

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకి ప్రజల అండ ఉందని పెదకూరపాడు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శనివారం గుంటూరులోని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో వారు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ బహిష్కరించిన నెలకుదుటి వరప్రసాద్ (బుజ్జి) చేసిన ఆరోపణలను క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండలపార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్, ఎస్సీసెల్ నాయకులు నల్లపాటి యోహానులు ఖండించారు. వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు పార్టీలో చేరి.. పదవులు దక్కించుకుని ఇప్పుడు ఎన్నికల ముందు ఆరోపణలు చేయడం బాధకరమన్నారు. బుజ్జి చేసిన ఆరోపణలు అసత్యాలన్ని స్పష్టం చేశారు. కేవలం కొందరు స్వార్థ పరుల ప్రోద్బలంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో ఎక్కడా రాజకియాల్లో జోక్యం చేసుకోలేదన్నారు. ఇటీవల టీడీపీలో చేరిన కన్నాలక్ష్మీనారాయణతో ఎందుకు భేటీ అయ్యారో బయటకు చెప్పాలన్నారు. ఒకపార్టీలో ఉంటూ .. మరోపార్టీ నేతలతో కలిసి కుట్ర చేయడం దారుణమన్నారు. అందుకే పార్టీ నుంచి బహిష్కరించినట్లు స్పష్టం చేశారు. ఉసరవెల్లి రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ బుజ్జి అన్ని అన్నారు. అలాంటి వాళ్ల తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే రకమన్నారు. పెదకూరపాడు పంచాయతీ ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేశారన్నారు. కన్నతల్లికి అన్యాయం చేసినవారితో సమానమన్నారు. నియోజకవర్గంలో పక్షపాతం , బంధుప్రీతి లేకుండ అభివృద్ధి చేస్తున్న వ్యక్తి ఎమ్మెల్యే శంకరరావు అన్నారు. సొంత నిధులతో ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన సొంత నిధులతో మంచి చేస్తున్న శంకరరావుపై ఇలాంటి ఆరోపణలు చేస్తే చూస్తు ఉరుకోమన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్నందునే బహిష్కరించారన్నారు. ప్రజల పక్షాణ నిలబడే శంకరరావుపై కొందరు కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చేబుతారన్నారు.ఈ కార్యక్రమంలో నూతలపాటి వెంకట శివ, మండల సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, బత్తుల రాజేంద్రలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వడదెబ్బ నివారణకు హోమియో మందులు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో గల రామాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, ఏ కే హోమియో కేర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎండల వేడి వల్ల కలిగే వడదెబ్బ నివారణ కోసం హోమియో మందులు శనివారం పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ఎండ వేడిని తాళలేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి తరుణంలో వడదెబ్బ నివారణ కోసం మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఏ కే హోమియోకేర్ డాక్టర్ అయోధ్య కృష్ణ మాట్లాడుతూ హోమియోపతి అనేది అన్ని వ్యాధులకి సరైన మందు అని, ప్రతి ఒక్క మనిషి ప్రస్తుతం ఉన్న రోజుల్లో ఇంగ్లిష్ మందులు వల్ల గాని, నాటు మందుల వల్ల చాలా సైడ్ ఎఫెక్టు రావడం జరుగుతుందన్నారు. కానీ హోమియోపతి కి ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా రోగుల యొక్క రోగనిరోధకశక్తిని పెంచే విధంగా ఉంటుందన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పాయసం మహేష్ బాబు, జిల్లా సమన్వయకర్త నాగ సాయి ప్రసాద్, ట్రెజరర్ స్వామినాథన్ బాలసుబ్రమణ్యం, రమాదేవి, సాంబశివరావు, వెంకటేష్, సుబాని, మేదర బజార్ ప్రజలు పాల్గొన్నారు.

అందరికీ అల్లా దీవెనలు ఉండాలి

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రంజాన్ మాసంలో ముస్లింలు నిష్ఠ నియమాలతో ఉపవాసం ఉండి, రోజులో ఐదు సార్లు భక్తితో నమాజ్ ఆచరిస్తారని, అందరికీ ఆ అల్లా చల్లని దీవెనలు ఉండాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఈద్గాలో ముస్లింలకు శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం పెద్దలతో కూర్చొని నమాజు(దువా)లో పాల్గొన్నారు. అనంతరం ఉపవాస దీక్ష ముగించిన దీక్షాపరులకు ఇఫ్తార్ విందులో భాగంగా ఆయన స్వయంగా అన్నం వడ్డించారు. ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు ఇలా ఇఫ్తార్ దావత్ ఇవ్వడం ఆనందంగా ఉందని, అందరూ ఆరోగ్యాలతో ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కన్వీనర్ షేక్ నాగూర్ మీరాన్, సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, కళ్ళం విజయభాస్కరరెడ్డి, కో అప్షన్ సభ్యులు షేక్ మౌలాలి, కౌన్సిలర్ సయ్యద్ సలీం, అచ్యుత శివప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు సయ్యద్ ఖాజా, షేక్ జానీ, షేక్ గని, ఎసెమ్ యూనస్, హైదరాబాద్ సుభానీ, ముస్లిం నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.



పట్టణంలోని ఈద్గాలో ముస్లిం పెద్దలతో కలిసి దువా చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

జన సంక్షేమమే జగనన్న ఆశయం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: రాష్ట్రంలో జన సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాంలో భాగంగా పెదకూరపాడు మండలం లింగంగుంట్ల గ్రామంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏఏ స్థాయిలో .. ఏఏ వర్గాలకు .. చెందుతున్నాయో , ఏమాత్రం చెందుతున్న అన్న అంశంపై ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం అన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజాదరణ పొందుతున్నాయన్నారు. జగనన్న అందిస్తున్న నవ రత్నాలు తదితర అంశాలు ఆయన పాలనపై ప్రజలకు నమ్మకం పెంచాయన్నారు.

లింగంగుంట్లలో రూ.8.69 కోట్లతో అభివృద్ధి , సంక్షేమం..

లింగంగుంట్లలో నాలుగేళ్లలో రూ.8.69 కోట్లతో అభివృద్ధి , సంక్షేమం అందించామని ఎమ్మెల్యే శంకరరావు అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 1198 మంది లబ్ధిదారులకు రూ.6.46 కోట్లు, సంక్షేమ సాయం అందించామన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.63లక్షలు, జగనన్న అమ్మ ఒడి ద్వారా 185 మందికి రూ.83లక్షలు, వైఎస్సార్ చేయూత ద్వారా 97 మందికి రూ.54లక్షలు, జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.27లక్షలు, వసతి దీవెన ద్వారా రూ.27లక్షలు, ఈబీసీ నేస్తం ద్వారా రూ.28.5లక్షలు, వీటితో పాటు వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 383 మందికి రూ.2.60 కోట్లు, రూ.38 లక్షలతో సీసీ రోడ్లు, రూ.79లక్షలతో పరిపాలన భవనం, రూ.42లక్షలతో ఇర్‌డబ్ల్యూఎస్ పనులు , నాడు-నేడు ద్వారా రూ.57.50లక్షలతో పాఠశాలల అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్ ఎంపీపీ మేరి రాణి,మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు యండ్లూరి నాగమల్లేశ్వరరావు, నేహేమియా తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యలను వింటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

చివరి పంటకు సాగు నీరివ్వండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో మిర్చి, మొక్కజొన్న పంటలు చివరి దశలో ఉన్నాయని, ఆరుతడి పెట్టుకునేందుకు సాగునీరు తడి పెట్టుకునేందుకు సాగునీరు విడుదల చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎస్ఎస్‌పి సూపరిటెండ్ ఇంజినీరును శనివారం కోరారు. ఇటీవల ఎమ్మెల్యే నంబూరు శంకరరావును రైతులు కలిసి ఒక తడినీరు పెట్టడంవల్లన 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్ఎస్‌పి ముఖ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్ఎస్‌పి అధికారులు వెంటనే స్పందించి రెండు రోజుల్లో నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. డ్యాంలో నీటి నిల్వలు తక్కువుగా ఉన్నందున, వేసవి కాలం కావున భూమి నీటిని ఎక్కువుగా పీల్చే అవకాశం ఉన్నందున, రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా మాత్రమే వాడుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావుసూచించారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా మంచినీటి చెరువులన్నింటిని కూడ నీటితో నింపాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్ఎస్‌పి అధికారులను కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు



చివరి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

సత్తెనపల్లి: డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో ఈ నెల 3న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు ఉప విద్యాశాఖ అధికారి వి. వెంకటేశ్వరరావు తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

ముప్పాళ్ళ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవతరగతి పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ ఒంగోలురాజు లు శనివారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించారు. తాగునీరు, వెలుతురుతో పాటుగా అక్కడే విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తోను మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షలు కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మొత్తం నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఒంగోలురాజు తెలిపారు.

క్రోసూరు: మండలంలో పదోతరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల ద్వారా 926 మంది విద్యార్థులకు గాను 900 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈనెల 3 వ తేదీ నుంచి ప్రారంభమై శనివారంతో ముగిసాయని ఎంఈఓ ఏసురత్నం తెలియచేశారు.

అమరావతి: సంవత్సరమంతా విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి రాసిన పదవతరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిసాయి. విద్యార్థుల జీవితంలో తొలిమెట్టుగా భావించే పదవతరగతి పరీక్షలను విద్యార్థులతోపాటుగా అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులకు కూడా పరీక్షగానే భావించి శ్రమించారు. ఈనెల 3వతేదీ నుంచి శనివారం వరకు అమరావతిలోని శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్, సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలలో సమారు 554 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే పోలీస్‌శాఖ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూశారు.

ఆశ్రమ ఆస్తులు ఆక్రమించేందుకు కబ్జాదారుల యత్నం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారీ వీర బ్రహ్మేంద్ర ఆశ్రమం ఆస్తులను ఆక్రమించేందుకు అధికారులను అడ్డంపెట్టుకుని కబ్జాదారులు విశ్వప్రయత్నం చేశారని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ధర్మకర్త చింతాడ లలితాంబ మాతాజీ అన్నారు. పట్టణంలోని ఆశ్రమం ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ్రమ వ్యవసాయ భూమిలోని కొంత భాగాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకొన్నవ్యక్తులు శనివారం అధికారుల ముసుగులో రౌడీలను తీసుకువచ్చి ఆశ్రమ పొలంలోకి చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నించారన్నారు. ఆ సమయంలో ఆశ్రమ భక్తులు, ఆశ్రమ బాధ్యులు ఆశ్రమస్థలం వద్దకు వచ్చి ఎటువంటి నోటీసులను ఇవ్వకుండా స్థలాలను కొలవడాన్ని ప్రశ్నించారన్నారు. కోర్టు వివాదాల్లో ఉన్న వాటి సమాచారం సంబంధిత సర్వేయర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆశ్రమానికి సంబంధించిన 2.70 ఎకరాలలో ఇప్పటికే సత్తెనపల్లి కోర్టులో పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఆశ్రమానికి అను కూలంగా ఇచ్చారన్నారు. రెవెన్యూ రికార్డులలో స్పష్టంగా ఆశ్రమం పేరిట రికార్డు అయి ఉందన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు అన్ని కూడా ఆశ్రమ మఠాధిపతి పేరుతో రెవెన్యూ అధికారులు మంజూరు చేశారన్నారు. భూమిశిస్తు, మునిసిపాలిటీ టాక్స్‌లను చెల్లిస్తున్నామన్నారు. 1951-1966లో సత్తెనపల్లి సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో ఆశ్రమ ధర్మకర్త మఠాధిపతి చింతాడ సూర్యప్రకాశరావు పేరిట రిజిస్టర్ డాక్యూమెంట్ నమోదై ఉందని ఆమె తెలిపారు. ఇప్పటివరకు స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ వల్ల తాము రక్షింప బడ్డామని, ఆశ్రమ ఆస్తులను తానూ కాపాడ తానని హామీ ఇచ్చారన్నారు. అవసరమైతే ముఖ్య మంత్రి జగన్‌తో మాట్లాడతానని తమకు తెలిపారని ఈసందర్భంగా గుర్తు చేశారు. గతంలో గోశాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారని ఆమె తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన వారుగా చెప్పుకొంటున్న పెద్దిరెడ్డి గోవిందరెడ్డి, అంజిరెడ్డి, మంగమ్మ, దీపికలు వారికి ఎటువంటి హక్కు, సంబంధం లేని సనారీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆస్తిని ప్రకాశంజిల్లా అమ్మనబ్రోలు రిజిస్టర్ కార్యాలయంలో తప్పుడు డాక్యూమెంట్లతో సుమారు 48. సెంట్ల రాయించుకున్నారు. తన భర్త అయిన స్వప్రకాష్ గురూజీ పట్టణంలోని తన ఆస్తులను విక్రయించి 1939లో సనరీ వీరబ్రహ్మేంద్ర పీఠాన్ని స్థాపించి ఆశ్రమాన్ని నిర్మించారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు తాము వంశపారంపర్య ధర్మకర్తలుగా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈవిషయం పై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, హోం మంత్రి తానేటి వనితకు, డీజీపీకి, లోకాయుక్తకు, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నామని ఆమె కోరారు.